

వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యం
కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడం సీఐటీయూకే సాధ్యమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్ అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. 8లో



బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం
విశ్వగురువు బసవేశ్వరుడు చూపిన మార్గంలో అందరూ నడుచుకోవాలని బసవ ధర్మ పీఠం అధ్యక్షురాలు డాక్టర్ గంగ మాతాజీ అన్నారు. 8లో



పాఠశాలల్లో న్యూ ఇయర్ వేడుకలు
ఆయా మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు ముందస్తుగా న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 9లో

న్యూస్‌రీల్

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి
డీఈఓ రమేశ్‌కుమార్



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఈఓ రమేశ్‌కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): మన ఊరు–మన బడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డీఈఓ రమేశ్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని శెట్టిపల్లి కలాన్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పనులను పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు.

యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేశ్



మల్లేశ్‌ను సన్మానిస్తున్న ఆ సంఘ నాయకులు

మెదక్‌జోన్: యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గండి మలేశ్ యాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావు యాదవ్ ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా ఎన్నికైన మల్లేశ్‌ను శుక్రవారం యాదవ కులసంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ యాదవ కులస్తులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకుడు చోళారామ్ చరణ్ యాదవ్, కుర్మ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లయ్య, మల్లేశం, యాదగిరి, భూమయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేనేజర్ చంద్రశేఖర్

టేక్మాల్(మెదక్): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని చంద్రుతండాలో బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీసీసీబీ బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీకి మహిళా రుణాలు, పంట, బంగారం, మార్ట్‌గేజ్ లోన్‌లు తీసుకోవచ్చని అన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీ, బ్యాంక్ ద్వారా ఆన్‌లైన్ సేవల సదుపాయం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి సర్దార్, ఎంపీటీసీ మోహన్, పీఏసీఎస్ డైరెక్టర్ చందర్, ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, సీఈఓ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మెదక్ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. కళాశాలలో మెస్ మేనేజర్ పోస్టు(గెస్ట్ పద్ధతి), అర్హత ఎమ్మెస్సీ న్యూట్రిషియన్ అండ్ ఫుడ్‌సైన్స్ లేదా బీఎస్సీ న్యూట్రిషియన్ అండ్ ఫుడ్‌సైన్స్ కోర్సు చేసినవారు, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ (ఔట్ సోర్సింగ్)కు ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు జనవరి 9లోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

స్టాఫ్ నర్సు పోస్టుకు..
నర్సాపూర్: కౌడిపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన స్టాఫ్ నర్సు పోస్టును భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ టి.సంపత్‌కుమార్ శనివారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం కోర్సు చదివిన మహిళా అభ్యర్థులు జనవరి 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సరికొత్తగా ముందుకు

- మెరుగైన సేవలే లక్ష్యం: కలెక్టర్ హరీశ్
- శాంతి భద్రతలపై రాజీ పడబోం: ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

న్యూ ఇయర్‌లో అభివృద్ధిపై జిల్లా అధికారుల ప్రణాళికలు

మెదక్‌జోన్: నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యమని జిల్లా అధికారులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని జిల్లా కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. మరోవైపు శాంతి భద్రతల విషయంలో ఎట్టి పరిస్థితిలో రాజీపడబోమని ఎస్పీ రోహిణీప్రియదర్శిని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతపై ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. సుబీక్ష పాలన అందించేందుకు తీసుకోబోయే అంశాలపై కలెక్టర్, ఎస్పీ 'సాక్షి'తో పలు విషయాలను పంచుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



- జిల్లా ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు.
- భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తాం.
- టెక్నికల్ సమస్యల పరిష్కారానికి నిపుణుల సాయం కోరుతాం.
- భూ రిజిస్ట్రేషన్ పూర్తయిన గంటలో అమ్మకందారుడి పేరు నుంచి కొనుగోలు దారుడి పేరు రికార్డుల్లో పొందు పర్చేలా చూస్తాం.
- అర్హులైన రైతులకు రైతుబంధు, రైతు బీమా పథకం అందేలా చర్యలు తీసుకుంటాం.
- అసైన్డ్ భూముల క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలను ధరణిలో పొందుపరిస్తే చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయి.
- అసైన్డ్ భూముల రికార్డ్‌తో భూసమస్యలు జీరో శాతానికి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరికీ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం.
- శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడతాం.
- కొత్త ఏడాదిలో నూతన కలెక్టరేట్ భవనం నుంచి పరిపాలన ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఫిబ్రవరి నెలలో కొత్త భవనం ప్రారంభిస్తాం.
- విశాలమైన గదులు, సమావేశ మందిరాలు, ప్రజావాణి హాల్‌తో పాటు అన్ని సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనం పరిపాలనకు అనువుగా ఉంటుంది.

– హరీశ్, కలెక్టర్

సైబర్ క్రైమ్‌పై ఫోకస్



- నూతన సంవత్సరంలో జిల్లాలో సైబర్ క్రైం నియంత్రణ లక్ష్యంగా ముందుకు సాగుతాం. మహిళలు, పిల్లల భద్రతకు అవసరమైన చర్యలు చేపడతాం.
- రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.
- రానున్న రోజుల్లో ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేస్తాం.
- పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పిస్తాం.
- రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా మద్యం సేవించడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో జరుగుతున్నాయి. కొత్త ఏడాదిలో వీటిపై ప్రత్యేక దృష్టి పెడతాం.
- రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.
- వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. ప్రజలు దీనికి సహకరించాలి.
- రోడ్డు ప్రమాదాల కేసుల్లో శిక్షల శాతం పెంచటం, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యే నిఘా, చోరీలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటును ప్రజలకు వివరిస్తాం.
- ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.
- ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్లతో కలిసి రోడ్లను తనిఖీలు చేసి లోపాలను సరిదిద్దుతాం.
- ప్రజలకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు

– రోహిణీ ప్రియదర్శిని, ఎస్పీ

సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ వెంకటశైలేశ్

సమావేశంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ, అధికారులు

మెదక్ కలెక్టరేట్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తామని, జెడ్పీ సీఈఓ వెంకట శైలేశ్ తెలిపారు. శనివారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పల్లె ప్రగతి, పారిశుద్ధ్యం, పచ్చదనం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలపై గ్రామ సభలు నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పిస్తామని మంత్రికి తెలిపారు. ప్రధాన కూడళ్లు, గ్రామపంచాయతీ ఎదుట పథకాలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, పంచాయతీ భవనాల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వంటి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి శ్రీనివాస్, డీపీఓ రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డీఐఓ మాధురి శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, నర్సులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు, ఈకేవైసీ, ఆధార్ అనుసంధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించారు.

పర్వతారోహకుడికి అభినందన



బసవరాజ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మనోహరాబాద్ మండలానికి చెందిన భీమరి బస్వరాజ్ అందరికీ ఆదర్శమని జెడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో బసవరాజ్‌ను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నశంకరంపేట్ మండలం టి.మాందాపూర్‌కు చెందిన బసవరాజ్ 2017లో కిలిమంజారో, 2018లో సిక్కిం రాష్ట్రంలోని బిసిరాయ్ పర్వతం, 2019లో ఉత్తరఖండ్‌లోని అమౌంట్ భగీరథ పర్వతాలను విజయవంతంగా అధిరోహించాడని కొనియాడారు. ఎవరెస్టు శిఖరం ఎక్కేందుకు సిద్ధమవుతున్న బసవరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపి, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్, నాయకులు వెంకట్‌గౌడ్, మహేందర్‌గౌడ్, భిక్షపతి, ఆత్మకమిటీ డైరక్టర్ భిక్షపతి, సుధాకర్ తదితరులున్నారు.

బాధితులకు అండగా ఉంటాం

దండుపల్లి గ్రామంలో నంబి దీక్షిత, బండారి నర్సమ్మ చికిత్సకు అవసరమైన రూ.5 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఆమెతో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్, ఎంపీటీసీ లత, సర్పంచ్ పంజాలక్ష్మీ, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు



క్రీడాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: గుల్షన్ క్లబ్ టీటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాస్ హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఓఎస్ఓ నాగరాజు, ఆర్ఐ రమేశ్ యాదవ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్, గుల్షన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం టేబుల్ టెన్నిస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ప్రభు, సభ్యులు హనుమంతు, శ్రీనివాస్, మురళి, డాక్టర్ సరిత తదితరులు క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. సౌజన్య యూనివర్సిటీకి ఎంపికైన క్రీడాకారుడిని శాలువాతో సన్మానించారు. జి.అర్నీత్, రవితేజ, అనీష్, స్టాండ్ బాయ్స్ కిశోర్, జూనియర్స్ విభాగంలో విశ్వేశ్వర్, శ్రీనివాస్ చారి, సాయి ప్రణీత్, స్టాండ్ బాయ్‌గా నరేష్ ఎంపికయ్యారు. జనవరి 4 నుంచి హైదరాబాదులో జరిగే అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. టీం కోచ్ మేనేజర్లుగా నరేష్, చందర్ వ్యవహరిస్తారన్నారు.



కొత్త ఏడాదికి స్వాగతం

కౌడిపల్లి(నర్సాపూర్): వెల్‌కం చెబుతున్న రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలకు జరుపుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణ ఆధ్వర్యంలో పాఠశాలలో రంగు రంగుల ముగ్గులు వేశారు. 2023కు స్వాగతం అని రాశారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలు కలగాలని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖులు, ఎస్ఎంసీ చైర్మన్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు




ఆపరేషన్ స్మైల్ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అదనపు ఎస్పీ బాలస్వామి, అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: పిల్లలతో పని చేయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్‌కి సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా 14 ఏళ్లలోపు పిల్లలను బాలకార్మికులుగా పరిగణిస్తారని, వారితో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని, వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. నేటి హైటెక్ యుగంలోనూ బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం బాధాకరమని అన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, తయారీ, మైనింగ్, నిర్మాణ రంగం, కర్మాగారాలలో, హోటళ్లలో, రైల్వే, బస్సు స్టేషన్‌లో చిన్నారులను కార్మికులుగా పనిచేస్తున్నారని, ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నాని తెలిపారు. అనాథలు, కుటుంబ పేదరికం, నిరక్షరాస్యత, పిల్లల అపహరణ కారణాలతో బాలలు కార్మికులుగా మారుతున్నారని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూళనకు ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు పలు కార్యక్రమాలు చేస్తున్నారని వివరించారు. చిన్నారులు పని చేస్తున్నట్లు తెలిస్తే 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఆపరేషన్ స్మైల్‌కు సంబంధించిన పోస్టర్‌ను అదనపు ఎస్పీ బాలస్వామి ఆవిష్కరించారు. సమావేశంలో డీఈఓ రమేశ్, బాలల సంరక్షణ అధికారి కరుణశీల, నాగరాజు, కార్మికశాఖ అధికారి యాదయ్య, రాజు, పాల్గొన్నారు.

మహిళలు, బాలబాలికలకు షీటీమ్ రక్ష
మహిళలు, బాలబాలికలకు రక్షణకు షీటీమ్ పనిచేస్తుందని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని పేర్కొన్నారు. గత నవంబర్‌లో షీటీం నిర్వహించిన కార్యక్రమాలను వెల్లడించారు. జిల్లాలో ఒక ఎఫ్ఐఆర్, 4 రెడ్ హ్యాండెడ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో 239 హాట్‌స్పాట్‌లను గుర్తించామని, మెదక్, తూప్రాన్ డివిజన్ల వారిగా షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌పై డయల్–100 లేదా షీటీమ్ వాట్సప్ నంబర్ 6303923823, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 08452–223533కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలపై 1098కు ఫిర్యాదు చేయాలన్నారు.

అయోమయం వీడేనా?

- జీఓ 59 క్రమబద్ధీకరణలో గందరగోళం
- మూడు విడతల్లో చెల్లించాలని మెసేజ్‌లు
- అవగాహన లేమితో కొరవడిన స్పష్టత



మెదక్ పట్టణ వ్యూ

మెదక్ రూరల్: ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మూడు విడతల్లో డబ్బులు చెల్లించాలని దరఖాస్తుదారుల ఫోన్లకు నేరుగా మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి మాత్రమే మెసేజ్‌లు రావడం, వారిలో ఒక్కొక్కరికి ఒక్కోలా చలాన్లు రావడం గందరగోళానికి గురిచేస్తుంది. ఈ ప్రక్రియకు సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అధికారులకు అవగాహన లేకపోవడంతో స్పష్టత కొరవడుతోంది. దీంతో ఎంత స్థలానికి ఏ మేర ధర చెల్లించాలో తెలియక దరఖాస్తుదారులు అయోమయం చెందుతున్నారు.

నిబంధనలు ఇలా..

- మెదక్ జిల్లాలో 21 మండలాలు, 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- జూన్ 2, 2014 కంటే ముందు నుంచి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని కబ్జాలో ఉన్న వారిని మాత్రమే అర్హులుగా నిర్ణయించారు.
- జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో మార్కెట్ విలువ ప్రకారం భూముల ధరను నిర్ణయించారు.
- 2014లో క్రమబద్ధీకరణకు ముందు ప్రాపర్టీ ట్యాక్స్ రశీదు, వాటర్, కరెంట్ బిల్, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఈ ఏడాది మార్చి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు అవకాశం కల్పించారు.
- జీఓ 58లో భాగంగా 125 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న అర్హులకు కొత్త ఏడాదిలో ఉచితంగా పట్టాలు ఇవ్వనున్నారు.
- అదేవిధంగా 250 గజాల విస్తీర్ణంలో ఉన్న ఇళ్లకు 2014లో ఉన్న మార్కెట్ విలువలో 50 శాతం, 500 గజాల లోపు 75 శాతం వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు.
- 500 గజాల కంటే ఎక్కువ స్థలం ఉన్నవారికి 2014 మార్కెట్ విలువ ప్రకారం డబ్బులను చెల్లించి క్రమబద్ధీకరించుకునే వెసులుబాటును కల్పించారు.
- ఇందులో భాగంగా మూడు విడుతల్లో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలని నేరుగా దరఖాస్తుదారుల ఫోన్‌కు మెసేజ్ పెడుతున్నారు.
- మొదటి, రెండు విడుతల్లో 35 శాతం చొప్పున, మూడో విడుతలో 30 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.
- కాగా ఈనెల 29 నుంచి మార్చి 1వ తేదీ వరకు మూడు దఫాల్లో డబ్బులను చెల్లించేందుకు గడువు విధించారు.

కొరవడిన స్పష్టత:

- ప్రభుత్వ ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిన జీఓ 59 అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఎలాంటి శిక్షణ ఇవ్వకపోవడంతో స్పష్టత కొరవడింది.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి మాత్రమే క్రమబద్ధీకరణకు డబ్బులు చెల్లించాలనే మెసేజ్‌లు రావడంతో మిగితా దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు.
- 240 గజాల స్థలంలోపు వారికి 2014 మార్కెట్ విలువలో 50 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉండగా, అంతకు మించి డబ్బులు కట్టాలని మెసేజ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- మార్కెట్ విలువ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్నారని, గజానికి రూ.1,100 చొప్పున లెక్కకట్టిన్నట్లు తెలిపారు.
- రెవెన్యూ శాఖకు సంబంధం లేని అధికారులతో సర్వే చేయించడంతో స్థలాల రికార్డులో హెచ్చు తగ్గులు ఉన్నట్లు దరఖాస్తుదారులు వాపోతున్నారు.
- రెవెన్యూ శాఖకు సంబంధం లేని అధికారులతో సర్వే చేయించడంతో స్థలాల రికార్డులో హెచ్చు తగ్గులు ఉన్నట్లు దరఖాస్తుదారులు వాపోతున్నారు.

ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం



తాతల కాలం నుంచి ఇదే గ్రామంలో ఉంటున్నాం. మా ముత్తాత కట్టిన పెంకుటిళ్లు శిథిలావస్థకు చేరడంతో కొత్త ఇంటిని నిర్మించుకున్నాం. ఇళ్ల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో సంతోషపడ్డాం. ఇంత వరకు రెగ్యులైజేషన్‌కు సంబంధించి ఎలాంటి మెసేజ్ రాలేదు.

– గంజి శ్రీశైలం, మంబోజిపల్లి, మెదక్

పెంకుటిల్లుకు రూ.2.42 లక్షలా?



ఇళ్ల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిన జీఓ 59ను స్వాగతిస్తున్నాం. నాకు 143 గజాల్లో పెంకుటిల్లు, ఆవరణతో కలిపి మొత్తం 177 గజాల స్థలం ఉంది. ప్రపోజల్ రికార్డ్‌లో అధికారులు 226 గజాలుగా నమోదు చేయడంతో రూ.2,42,125లను చెల్లించాలని చెబుతున్నారు.

– గొంటెల రాజేశ్వర్, మంబోజిపల్లి, మెదక్

క్లుప్తంగా

పోచమ్మ తల్లి విగ్రహం అపహరణ



పోచమ్మ తల్లి దేవాలయం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారం గ్రామంలోని పోచమ్మ గుడిలో అమ్మ వారికి విగ్రహాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. గుడిలో ఉన్న వస్తువులను ధ్వంసం చేశారు. శనివారం విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో సర్పంచ్ గూళ్ళ పుష్పబా గులుతో పాటు గ్రామస్తులు గుడికి చేరుకుని పరిశీలించారు. అమ్మవారి విగ్రహాన్ని అప హరించుకు పోవడమే కాకుండా గుడిలో ఉన్న వస్తువులను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ గ్రామస్తులు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుల్లూరు బండపై ఉత్తర ద్వార దర్శనం

సిద్దిపేటరూరల్: పుల్లూరు గ్రామ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో జనవరి 2న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు కలకుంట్ల వెంకట నరసింహాచార్యులు శనివారం తెలిపారు. ఉదయం 4 గంటలకు స్వామి వారికి అభిషేకము, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వార దర్శనం గుండా స్వామి వారిని దర్శించుకోవచ్చన్నారు.

ములుగు జిల్లా పరిషత్ చైర్మన్‌కు సన్మానం



ములుగు జిల్లా పరిషత్ చైర్మన్‌ను సన్మానిస్తున్న రాములు నేత తదితరులు

జహీరాబాద్ టౌన్: ములుగు జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్వర్‌ను జహీరాబాద్ పద్మశాలి సంఘం నాయకులు సన్మానించారు. శనివారం ఆయన షిర్డి వెళ్తూ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు రాములు నేత ఇంటికి సందర్శించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్, మాజీ కౌన్సిలర్లు రాములునేత, మోతిరాం, నాయకులు మనోహర్, శంకర్, మాజీ జెడ్పీటీసీ మాణికమ్మ తదితరులు జగదీశ్వర్‌ను శాలువతో సన్మానించారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం

మనోహరాబాద్(తూప్రాన్): విశ్వసనీయ సమాచారం మేరకు కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించగా భారీగా గంజాయి చాకెట్లు దొరికినట్లు ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని వైష్ణవి కిరాణా దుకాణంలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నరనే సమాచారం రావడంతో కిరాణా దుకాణాన్ని సిబ్బందితో కలిసి తహసీల్దార్ భిక్షపతి తనిఖీ చేశారు. 33.5 కిలోల గంజాయి చాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. కొంతకాలంగా గంజాయి చాక్లెట్లను గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలుసుకున్నారు. గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని దుకాణ యజమానురాలు స్వప్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వప్న భర్త నరేశ్ పరారయ్యాడు.

బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం

బసవ ధర్మపీఠం అధ్యక్షురాలు గంగ మాతాజీ

జహీరాబాద్ టౌన్: మహాత్మ విశ్వగురువు బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రజలు నడుచుకోవాలని. కర్నాటక రాష్ట్రం బసవ ధర్మపీఠం అధ్యక్షురాలు డాక్టర్ గంగ మాతాజీ అన్నారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలోగల బసవ మండపంలో శనివారం రాత్రి బసవ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ మాతాజీ మాట్లాడుతూ బసవేశ్వరుడి మార్గం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆచరించదగ్గవన్నారు. అంటరానితన నిర్మూలన, మహిళలను గౌరవించడంతో పాటు అణగారిన ప్రజలను ఉన్నత పదువులను కట్టబెట్టిన గొప్పమానవతావాదని కొనియాడారు. కర్నాటక రాష్ట్రంలో కూడల సంగంలో నిర్వహించే 36వ శరణ మేళకు తరలిరావాలని పిలుపు ఇచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, సామాజిక ఉద్యకారులు ఢిల్లీ వసంత్, నాయకులు జనార్దన్, మక్బూద్, రాష్ట్రీయ బసవదళ్ జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న బసవ ధర్మపీఠం అధ్యక్షురాలు గంగ మాతాజీ తదితరులు



ఆహ్లాదం.. అరుణ వర్ణ శోభితం

జోగిపేట(అందోల్): ఆకాశంలో అరుణ వర్ణంలో ఉండే సూర్యుడు అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాడు. రోజూ సాయంత్రం వేళ జోగిపేటలోని అన్నాసాగర్ చెరువు కట్టపై ఆహ్లాదాన్ని పంచుతున్నాడు. శనివారం సూర్యాస్తమయ సమయంలో చెరువు కట్టపైకి వెళ్లిన వారు బంగారు వర్ణంలోకి మారుతున్న సూర్యుడి ప్రతిబింబాన్ని చూసి మురిసిపోయారు. ఆ దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించి సంతోషపడ్డారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు చోట్లు ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒకరు ఉరివేసుకోగా, ఇద్దరు చెరువులో దూకి ప్రాణాలు విడిచారు. మద్యానికి బానిసైన వృద్ధుడు చెట్టుకు ఉరివేసుకున్నాడు. లాక్‌డౌన్ సమయంలో కుటుంబ పోషణకు భవన నిర్మాణ కూలీ అప్పులు చేశాడు. అప్పుల విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. తీవ్రమనస్తాపంతో చెరువులో దూకాడు. ఇంటి నుంచి వెళ్లిన మరోవ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.



శంకర్(ఫైల్)

దుబ్బాకరూరల్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ భిక్యానాయక్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మదుగాని శంకర్(60) ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. శనివారం పొలాల పొదల్లోని చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తి మృతదేహం కనిపించింది. మృత దేహం పూర్తిగా కుళ్లిపోయింది. శంకర్ మృతదేహంగా గుర్తించి కుటుంబీలకు, పోలీస్‌లకు సమాచారం అందించారు. మద్యానికి బానిసై ఇంటి నుంచి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కౌసల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టమ్ నిర్వహించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అప్పులబాధ తాళలేక..

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గోపాల్ పేట కు చెందిన ముత్యం రెడ్డి(35) పదేళ్ల క్రితం కుటుంబ సభ్యుల కలసి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చి ఓడీఎఫ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. భవనం నిర్మాణ కూలీగా పనిచేస్తున్నాడు. లాక్‌డౌన్ సమయంలో పనులు లేక అప్పులు చేశాడు. 30వ తేదీన భార్యతో గొడవపడి చనిపోతానంటూ ఇంటి నుంచి వెళ్లాడు. నేరుగా వెళ్లి ఎర్రకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ముత్యం రెడ్డిని ఆపడానికి తల్లి, భార్య వెళ్లేసరికి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నర్సింహులు (ఫైల్)

దుబ్బాక: చెరువులోపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో శనివారం జరిగింది. గ్రామస్తుల తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండెకాయ నర్సింహులు (45) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధు మిత్రులను విచారించినా ఆచూకీ లభించలేదు. కాగా శనివారం ఉదయం శ్రీ రామదాసు చెరువు కట్టపై నర్సింహులు చెప్పులు, రుమాలు గుర్తించారు. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా నర్సింహులు మృతదేహం దొరికింది. విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సింహులు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



భాగ్యమ్మ మృతదేహం

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన లింగగారి భాగ్యమ్మ (41) వ్యవసాయ కూలీ. బుధవారం గజ్వేల్‌లోని బంధుల వద్దకు వెళ్లి తిరిగి శుక్రవారం స్వగ్రామానికి వచ్చేందుకు రామాగౌడ్‌ని బైక్‌పై లిఫ్ట్ అడిగింది. బైక్‌పై వస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా బైక్ అదుపు తప్పడంతో భాగ్యమ్మ, రామాగౌడ్ కింద పడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాగ్యమ్మ శనివారం మృతి చెందింది. భాగ్యమ్మ అల్లుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్ట్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంగలి లాలప్ప గ్రామంలోని ఓ పాన్‌షాప్ పక్కన మట్కా ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి చూడగా పాన్‌షాప్ దగ్గర లాలప్ప మట్కా ఆడుతున్నాడు. పోలీస్‌లను చూసిన పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందుతుడి నుంచి రూ.3600 నగదు, మట్కా చిట్టీలు, ఇతర పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చిట్కుల్ కారోబార్‌పై దాడికియత్నం

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ కారోబార్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిట్కుల్ గ్రామంలో అక్రమ నిర్మాణం జరుగుతుండటంతో పొరుగున ఉన్నవారు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పంచాయతీ కారోబార్ సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో స్థల యజమాని మహేశ్ కారోబార్ కిష్టయ్యను అసభ్య పదజాలంతో తిట్టి, దాడికి ప్రయత్నించారు. దీంతో కిష్టయ్య పంచాయతీ కార్యదర్శి కవితకు సమాచారం ఇచ్చాడు. పంచయతీ కార్యదర్శి సూచన మేరకు కిష్టయ్య పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

కోహీర్(జహీరాబాద్): ఊరకుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్ పట్టణ శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం చోటుచేసుకొంది. రైతు కొత్తకాపు శ్రీకాంత్‌రెడ్డి అలియాస్ బబ్లూ అందించిన సమాచారం ప్రకారం లేగదూడ పొలంలో మేత మేస్తుండగా భీంనగర్ కాలనీకి చెందిన నాలుగు కుక్కలు దాడిచేయడంతో చనిపోయింది. ఊరకుక్కలు పెంపుడు జంతువులను చంపితింటున్నాయని, గతంలో కూడా మేకలు, లేగదూడలను చంపినట్లు తెలిపాడు. కుక్కల బెడద లేకుండా చేయాలన్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

నాగిరెడ్డిపేట: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామ శివారులో శనివారం రాత్రి ఇద్దరు బాలురు బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండలం పోచమ్మరాల్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు బైక్‌పై నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటకు బయలుదేరారు. మండలంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్ర సమీపంలో ప్రధాన రహదారిపై బైక్‌కు అడ్డుగా వచ్చిన కుక్కను వారు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్నవారు గమనించి ఇరువురిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మెదక్ తరలించారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్

దుబ్బాక: బీఆర్ఎస్ పార్టీని విమర్శించే హక్కు ఎమ్మెల్యే రఘునందన్ రావుకు లేదని ఎమ్మెల్యే ఫారుఖ్‌హుస్సేన్ మండిపడ్డారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం దుబ్బాకలో నూతన బస్టాండ్‌ను ప్రారంభించడానికి వచ్చిన రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే స్వాగతం పలకకుండా స్వార్థ రాజకీయాల కోసం తన కార్యకర్తలను, మంత్రులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం ఎంత వరకు సమంజసమన్నారు. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కృషితో రాయపోల్ మండలం ఏర్పడిందన్నారు. ఆ సమయంలో బీజేపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు తన స్వార్థ రాజకీయాల కోసం దుబ్బాక అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీకి దుబ్బాక నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి మోహన్ రెడ్డి, వెంకటేశ్వర శర్మ, మురళీ గౌడ్ తదితరులున్నారు.

వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



పత్రాలను అందజేస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంలో సీఐటీయూకే సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్ అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ చతుర్వేది చాంబర్‌లో ఒప్పంద సంతకాలు చేశారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ కిర్బీ పరిశ్రమలో చారిత్రాత్మక వేతన ఒప్పందం కుదిరిందన్నారు. వేతన ఒప్పందాలు సాధించడం సీఐటీయూకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజయ్య, జనరల్ సెక్రెటరీ వీఎస్ రాజు, యూనియన్ నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, శ్యాము, బీరప్ప విఠల్ మల్లేశ్, చిట్టన్న, లాఖన్, మహేశ్వర్ రెడ్డి, శంకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి టీడబ్ల్యూజేయూ ప్లీనరీ



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో సమావేశమైన ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ

పటాన్‌చెరుటౌన్: జనవరి 8 నుంచి 10 వరకు నేషనల్ జర్నలిస్ట్ ప్రతినిధులతో ప్లీనరీ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్‌హాల్‌లో ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, జిల్లా టీయూడబ్ల్యూజే నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 8వ తేదీన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ మహాసభను ప్రారంభిస్తున్నామని, అదేవిధంగా టీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం జరుపుతామన్నారు. కార్యక్రమానికి తెలంగాణలోని వర్కింగ్ జర్నలిస్టులు హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం ప్లీనరీ ప్రారంభమవుతుందన్నారు. జనవరి 9, 10న ప్లీనరీ సమావేశాలు జరుగుతాయన్నారు. దేశంలోని 22 రాష్ట్రాల ఐజేయూ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. చివరి రోజు నేషనల్ సెమినార్ ఆన్ మీడియా నిర్వహిస్తామని తెలిపారు.ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు, ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ ప్లీనరీలో టీయూడబ్ల్యూజేను ఐజేయూలో విలీనం చేస్తామని తెలిపారు. ఈ ప్లీనరీకి సీఎం కేసీఆర్‌తోపాటు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్లీనరీకి సంబంధించి వివరాలు త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ మారుతీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ



జెండాకు వందనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరికీ విద్య, వైద్యం, విద్యారంగ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అధ్యయనం, పోరాటం నినాదంతో స్వాతంత్య్ర ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాల కోసం ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో దేశంలో విద్య పేదవాళ్లకు అందకుండా చేసే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక నిధులు కేటాయించినప్పుడే విద్యారంగం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజు, జిల్లా నాయకులు సంతోషం, హరీశ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతి



ఎంపీటీసీ యాదమ్మ (ఫైల్)

దుబ్బాక: క్యాన్సర్‌తో బాధపడుతున్న రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ బ్యాగరి యాదమ్మ (57) శనివారం మృతి చెందింది. 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి 750 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. యాదమ్మ కుమారుడు సతీశ్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి అనేకసార్లు జైలుకెళ్లాడు. ఉద్యమకారులను గుర్తించిన టీఆర్ఎస్ పార్టీ సతీశ్ తల్లికి ఎంపీటీసి టికెట్ ఇచ్చింది.

పలువురు సంతాపం

ఎంపీటీసీ యాదమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ యాదమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాదమ్మ కుమారుడు సతీశ్‌ను ఓదార్చి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీనిచ్చారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రహీమొద్దీన్, తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

తోపులాటలో సీఐ ఆపిల్ వాచ్ మాయం

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో శుక్రవారం మార్కెట్ గోదాములను మంత్రులు ప్రారంభించారు. బీజేపీ కార్యకర్తలకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యకర్తలు ఒకరినొకరు నెట్టుకుంటున్న సమయంలో హుస్నాబాద్ సీఐ కిరణ్ చేతికున్న ఆపిల్ కంపెనీ వాచ్ కింద పడి పోయింది. దాని విలువ సుమారు రూ.48 వేలు ఉంటుంది. వాచ్ దొరికితే దుబ్బాక పోలీస్ స్టేషన్లో అప్పగించాలని సీఐ కృష్ణ తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి హెచ్ఎంకు నోటీసులా?

మెదక్‌జోన్: కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం సరికాదని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో డీఈఓకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్ మాట్లాడారే. ఎంఓఎంబి పనుల్లో రూ.30 లక్షలు అంచనా దాటిన వాటికి నేటికీ టెండర్లు ఖరారు కాలేదన్నారు. ఆ నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఎవరిపై చర్యలు తీసుకున్నారన్నారు. కేవలం ఉపాధ్యాయులనే భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు న్యాయమన్నారు. ఎంఓఎంబి పనుల నిర్లక్ష్యానికి వివరణ ఇవ్వాల్సిందిగా ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యం

తల్లి ఫిర్యాదు.. కేసు నమోదు

అల్లాదుర్గం(మెదక్): భర్తతో గొడవపడి వివాహిత ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముస్లాపూర్ గ్రామానికి చెందిన సింగూర్ సిద్దుతో నెరడిగుంట గ్రామానికి చెందిన సంగీతతో ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. శుక్రవారం భార్యాభర్తల గొడవ పడ్డారు. దీతో సంగీత ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. సంగీత తల్లి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సంగీత (ఫైల్)

దొంగను పట్టుకున్న వ్యాపారులు

పోలీసులకు అప్పగింత

నర్సాపూర్: నర్సాపూర్‌లో చోరీ చేసిన బ్యాటరీని అమ్మేందుకు ప్రయత్నించిన వ్యక్తిని వ్యాపారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని రుస్తుంపేటకు చెందిన ఓ యువకుడు శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో పట్టణంలోని చౌరస్తా సమీపంలో ఉన్న బైక్ రిపేరు దుకాణానికి వచ్చి ఓ బ్యాటరీని అమ్మేందుకు ప్రయత్నించాడు. బ్యాటరీ ఎక్కడిదని దుకాణదారుడు ప్రశ్నించగా తనకు ఆటో ఉందని ఆటోను ఫైనాన్స్ చేసిన సంస్థ వ్యక్తులు తీసుకుపోయారని అందుకే ఆటోలోని బ్యాటరీ అమ్మేందుకు తెచ్చానని నమ్మబలికాడు. మెకానిక్‌కు అనుమానం వచ్చి తన ఇరుగు పొరుగున ఉన్న వ్యాపారులను పిలిచాడు. మెకానిక్‌తో పాటు చుట్టుపక్కల వ్యాపారులు వచ్చి యువకున్ని ప్రశ్నించగా అతడు చోరీ చేసినట్లు వారికి అనుమానం బలపడటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బైక్ మెకానిక్ దుకాణానికి సమీపంలో పార్కు చేసిన ఆటో నుంచి బ్యాటరీని చోరీ చేసి తెచ్చినట్లు యువకుడు అంగీకరించాడు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ గంగరాజును వివరణ కోరగా యువకున్ని తమకు అప్పగించారని, అతనిపై ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నాడు. ఎవరూ ఫిర్యాదు చేయనందున అతడిని విడిచి పెట్టినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సురేందర్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంట్లో విద్యుత్ మరమత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదఘాతానికి గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం మర్రిచెట్టుతండా పంచాయతీ వీరమాన్‌సింగ్‌తండాలో జరిగింది. శనివారం ఏఎస్ఐ విఠల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరమాన్‌సింగ్‌తండాకు చెందిన అంగోత్ సురేందర్ (41) 15 రోజుల క్రితం నూతనంగా ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేశాడు. శుక్రవారం రాత్రి ఇంటిలో కరెంట్ సరఫరా కావడం లేదని మరమ్మతు చేసేప్రయత్రంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.